| | |
|---|---|
| **Date:** 20.02.2023 | **Publication:** Eenadu (Telugu) |
| **Page no:** 21 | **Edition:** Hyderabad |
| **Headline : Be confident in foreign travel** | |

# విదేశీ ప్రయాణంలో ధీమాగా...

**విదేశీ ప్రయాణం ఒక వినూత్న అనుభవం. కొత్త సంస్కృతులు, వంటకాలు, ప్రదేశాలు ఇలా ఎన్నింటినో అన్వేషించవచ్చు. ఒక కొత్త దృక్పథాన్ని ఇస్తుంది. ఎన్నో అనుభవాలను మూటగట్టుకోవచ్చు. విదేశాలకు వెళ్లాలంటే వీసా, టిక్కెట్లు, వసతి ఇలా ప్రతి అంశంలోనూ కచ్చితమైన ప్రణాళిక ఉండాల్సిందే. ఇందులో కీలకమైన అంశం మరోటి ఉంది. అదే ప్రయాణ బీమా (ట్రావెల్ ఇన్సూరెన్స్). వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో పర్యటనల కోసం వెళ్లేవారు దీని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**




వేరే దేశానికి వెళ్లి, అక్కడ ఏదైనా వైద్య అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటే ఎలా అనే ఆలోచన కాస్త ఆందోళన కలిగించేదే. తెలియని ప్రదేశంలో అలాంటి పరిస్థితుల్లో చిక్కుకోవడం వల్ల ప్రయాణం చెడిపోవడమే కాకుండా, మీ జేబుపైనా భారం పడుతుంది. ఇలాంటి సమయంలోనే ప్రయాణ బీమా సహాయం చేస్తుంది. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చులను చెల్లిస్తుంది. అత్యవసర శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య అవసరాలతో పాటు, ప్రమాదాలకూ ఈ పాలసీ పరిహారం ఇస్తుంది.

**విమానం ఆలస్యం:** ఏదైనా కారణం వల్ల విమానం పాలసీలో పేర్కొన్న కనీస గంటలకు మించి ఆలస్యం అయినప్పుడూ వివిధ ఖర్చుల కోసం పాలసీ మీకు కొంత మొత్తం చెల్లిస్తుంది. ఇందులో భోజనాలు, ఇతర అవసరమైన ఖర్చులూ ఉంటాయి. ఈ ఖర్చులను పాలసీదారుడు ముందుగా భరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బీమా సంస్థకు సంబంధిత బిల్లులు సమర్పించి, ఖర్చులను తిరిగి పొందేందుకు వీలవుతుంది.

**సామగ్రి:** ప్రయాణంలో సామగ్రిని పోగొట్టుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. మీ ప్రణాళికలకు ఆటంకం కలిగించడమే కాకుండా, మీ బడ్జెట్‌నూ ప్రభావితం చేస్తుంది. కొత్త నగరంలో అడుగు పెట్టారు.. కొత్త విషయాలను తెలుసుకునేందుకు వెళ్లారు. కానీ, మీ సామగ్రి ఇంకా రాలేదు అనుకోండి.. ఇబ్బందే కదా. ఇలాంటి సందర్భాల్లో ఏదైనా కొనుగోలు చేసినప్పుడు ఈ మొత్తాన్ని పాలసీ మీకు తిరిగి చెల్లిస్తుంది.

**పాస్‌పోర్టు పోతే:** పరాయి దేశంలో అన్నీ సవ్యంగా ఉన్నప్పుడే ప్రయాణాన్ని ఆస్వాదించగలం. మీ విదేశీ ప్రయాణంలో పాస్‌పోర్టు ఒక కీలకమైన పత్రం. దీన్ని ఎప్పుడూ జాగ్రత్తగా ఉంచుకోవాలి. అనివార్య పరిస్థితుల్లో ఇది కనిపించకుండా పోతే కొన్ని సమస్యలు, అదనపు ఖర్చులకూ దారి తీస్తుంది. డూప్లికేట్ పాస్‌పోర్టు పొందేందుకు మీరు చేసిన ఖర్చులను ప్రయాణ బీమా ద్వారా పొందవచ్చు.

**ప్రయాణం రద్దయినప్పుడు:** దగ్గరి బంధువు మరణం, లేదా ప్రమాదం, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు తదితర కారణాల వల్ల మీ ప్రయాణాన్ని రద్దు చేయడం లేదా కుదించాల్సి రావచ్చు. ఇలాంటి సందర్భాల్లో తిరిగి చెల్లించని ఖర్చులకు ప్రయాణ బీమా వర్తిస్తుంది. సాధారణంగా హోటల్ బుకింగ్‌లు, విమాన టిక్కెట్ల నుంచి డబ్బు వెనక్కి రాకపోవచ్చు. ఇలాంటి ఖర్చులను బీమా పాలసీ నుంచి తిరిగి పొందేందుకు వీలుంది.

ఈ ప్రామాణిక రక్షణలతోపాటు, ల్యాప్‌టాప్, మొబైల్, విలువైన పత్రాలు, వస్తువులను కోల్పోయినప్పుడూ ప్రయాణ బీమా వర్తిస్తుంది. సాహస క్రీడల వంటి కొన్ని యాడ్ ఆన్ కవర్‌లూ అందుబాటులో ఉంటాయి. కొన్ని దేశాల్లో పర్యటించాలంటే ప్రయాణ బీమా తప్పనిసరి.

**- ఆదిత్య శర్మ,**
చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్,
బజాజ్ అలయాంజ్ జనరల్ ఇన్సూరెన్స్